www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 26 ఆగస్టు 2023

5

పశ్చిమ గోదావరి



లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసి, మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ నుంచి రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు, భూ సేకరణ, ఓటర్ల జాబితా సవరణ, సిసిఆర్‌సి కార్డులు, సివిల్ సప్లై తదితర అంశాలపై జిల్లా జాయింటు కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డితో కలిసి జిల్లాలోని అన్ని మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా ప్రగతిని జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకుని మాట్లాడారు. జిల్లాలో తొలగించిన ప్రతి ఓటును పునఃపరిశీలన చేయాలని స్పష్టం చేశారు. బిఎల్ఒలు తనిఖీ చేసిన ఫైల్స్‌ను పోలింగ్ స్టేషన్ వారీగా ప్రత్యేక అధికారులు తనిఖీలు చేయాలన్నారు. ఈ ప్రక్రియను ఆగస్టు 30 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెసి ఎస్.రామ్ సుందర్‌రెడ్డి, డిఆర్ఒ కె.కృష్ణవేణి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బియ్యం ధరలు పైపైకి..!



గతంతో పోలిస్తే 25 శాతం పెరుగుదల

బస్తాపై రూ. 350 అదనం

కేంద్రం నిర్ణయంతో ధరలు పెరుగుదల

ఉమ్మడి పశ్చిమలో తగ్గిన వినియోగం

ప్రజాశక్తి - భీమవరం

సామాన్య ప్రజానీకం గుండెల్లో బియ్యం ధరలు దడ పుట్టిస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా ధరలు పెరగడంతో పేదలు బెంబేలెత్తిపోతున్నారు. గతంతో పోలిస్తే 25 శాతం బియ్యం ధరలు పెరిగాయి. బస్తాపై సుమారు రూ.350 అదనంగా పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాణ్యత బట్టి కిలో రూ.60 నుంచి రూ.65కు ఎగబాకింది. అయితే దిగుబడి తగ్గడమే దీనికి కారణమని చెబుతున్నప్పటికీ సన్న రకం బియ్యం తినబడి పెరగడంతో బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయని రిటైల్ వర్తకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పేదలకు తిప్పలు తప్పట్లేదు.

ఒకప్పుడు సన్న రకం బియ్యాన్ని ఎగువ మధ్య తరగతి, సంపన్న వర్గాలే వినియోగించేవారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలు మక్కువ చూపుతున్నారు. పౌర సరఫరాల ద్వారా ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం నాసిరకంగా ఉండడం ఎక్కువశాతం మంది సన్న బియ్యంపై మక్కువ చూపుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. మొన్నటి వరకూ 26 కిలోల బస్తా రూ.1,200 ఉంటే, ప్రస్తుతం రూ.1500కు పెరిగింది. నాణ్యమైన బియ్యం 20కిలోల బస్తా రూ.1,600 పలుకుతోంది. అంటే అతికొద్ది రోజుల వ్యవధిలోనే 25 శాతం మేర ధరలు పెరిగాయి.

సామాన్య, మధ్య తరగతి ప్రజల నెలవారీ బడ్జెట్‌ను పెంచాయి. దీంతో ఆయా వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి వరిలో ఉమ్మడి పశ్చిమలో బియ్యం వినియోగం గణనీయంగా తగ్గింది. 2018 అమ్మకాలతో పోలిస్తే ఇప్పుడు అమ్మకాలు సుమారు 25 శాతం తగ్గాయి. దీనికి ప్రధాన కారణం ప్రజల్లో ఆహార నియమాలు పెరగడం, సాయంత్రం పూట అధిక జనాభా అల్పాహారంతో సరిపెట్టడంతో బియ్యం వినియోగం తగ్గింది.

అయినప్పటికీ ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో పండిస్తున్న వరి పంట ఇక్కడ వినియోగించింది లేదు. ఎదుకంటే ఇక్కడ ముతకరం బియ్యం ఉత్పత్తి అవుతాయి. ముతక బియ్యం ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతవుతాయి. రాష్ట్ర ప్రభుత్వాలు లెవీ తీసుకుని రేషన్ డిపోల ద్వారా పేదలకందిస్తున్న ముతక బియ్యం కొంతభాగం మరలా రీ సైక్లింగ్ అవుతుంటే కొంత భాగం రొయ్యలు, చేపల చెరువులకు, పశువుల దాణాగా వినియోగిస్తున్నారు. స్థానికంగా పండే వరి పంట ద్వారా వచ్చే బియ్యం స్థానిక అవసరాల్లో పదిశాతం మించి వినియోగం కావడం లేదు. మిగిలిన 9 శాతం ఇతర ప్రాంతాల నుంచి దిగుమతైన సన్న బియ్యాన్నే ఉమ్మడి జిల్లాలో వినియోగిస్తున్నారు.

మూడు నెలల్లో రూ. 350 పెరుగుదల

ఈ ఏడాది మార్చిలో 25 కేజీల బియ్యం బస్తా రూ.1,200 ఉంది. ఏప్రిల్‌లో రూ.1,450, ఆగస్టులో రూ.1,500 దాటి విక్రయిస్తున్నారు. మూడు నెలల కాలంలో బియ్యం బస్తాపై రూ.350 పెరిగింది. కర్నూల్ సోనామసూరి బియ్యం వంద కిలోలు రూ.6,800 పలుకుతున్నాయి. వ్యాపారులు, మిల్లర్లు పెద్ద ఎత్తున ధాన్యాన్ని నిల్వచేసి కృత్రిమ కొరత సృష్టించి ధర పెంచేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బిపిటి 76 కిలోల ధాన్యం బస్తా ఏప్రిల్‌లో రూ.2,350 నుంచి రూ.2,500 పలికింది. ప్రస్తుతం రూ.2,850 నుంచి రూ.మూడు వేల పలుకుతున్న పరిస్థితి.

కేంద్రం నిర్ణయంతో ధరలు పెరుగుదల

పన్నుల ఉపశమనం పొందడానికి 26 కిలోలు, 30 కిలోల బస్తాలను అందుబాటులోకి తెచ్చాయి. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం 25 కేజీల వరకూ బ్రాండ్‌తో అమ్ముతున్న బియ్యానికి పన్ను వసూలు చేస్తున్నారు. 26 కిలోలు దాటితే పన్ను ఉండదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వ్యాపారులు 26 కేజీల బస్తాలను విక్రయిస్తున్నారు. 26 కిలోల సన్న బియ్యం బస్తా ఏప్రిల్‌లో రూ.1400 ఉంది. డిమార్ట్‌లో రూ.1750 పలుకుతోంది. ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడం వల్ల ధాన్యం దెబ్బతిందని, నిల్వలు లేవని వ్యాపారులు చెబుతున్నారు. పదేళ్లలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయి ధరలు పెరిగాయి.

రేషన్ బియ్యం తినేందుకు విముఖత..

పౌర సరఫరా శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పేద ప్రజానీకం తింటున్నప్పటికీ ఎక్కువ శాతం విముఖత చూపుతున్నారు. ఇవి తినడం వల్ల రకరకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని రేషన్ లబ్ధిదారులు చెబుతుండంతో తినబడి తగ్గుతున్న పరిస్థితి. వినియోగం ఏంటంటే కిలో రూపాయి బియ్యం కొనుక్కున్న పౌరులు సైతం కోటా బియ్యాన్ని రిటైల్ దుకాణాల్లో మార్చిడి చేసుకుంటున్న పరిస్థితి. కోటా బియ్యం బ్లాక్ మార్కెట్లో కిలో రూ.12లకు విక్రయిస్తున్నారు. ఈ బియ్యం 50 శాతం మరలా రిటైల్ బియ్యం వర్తకుల ద్వారా రైస్ మిల్లులకు చేరి కొత్త సంచుల్లో ప్యాకింగ్ చేసి మరలా ప్రభుత్వ చౌకధరల దుకాణాలకు వస్తున్నాయి. ఈ విధానంలో దళారులకు కిలోకు ఖర్చులు పోనూ ఎనిమిది రూపాయలు మిగులుతున్నట్లు చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో కోటా బియ్యాన్ని మార్పిడి చేసుకోవడం లేదా అమ్మకాలు జరుగుతుంటే గ్రామీణ ప్రాంతాల్లో కోటా బియ్యాన్ని పశువులకు, చేపల, రొయ్యల చెరువుల్లో మేత గా వినియోగిస్తున్న పరిస్థితి ఉంది.

ప్రమాదం మాటను ఆరోగ్యం

పాలిష్ పట్టిన బియ్యం, సన్నరకాల బియ్యంలో చక్కెర శాతం ఎక్కువగా ఉంటుందని, మధుమేహ వ్యాధిగ్రస్తులు ఆ బియ్యం తినడం వల్ల మరింతగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నప్పటికీ వాటివైపే ఎక్కువ మక్కువ చూపుతున్నారు. పట్టు తక్కువ బియ్యం, బ్రౌన్ రైస్, ముతక బియ్యం, రంగుమారిన బియ్యం, దంపుడు బియ్యం తినడం ద్వారా మధుమేహం కొంతమేరకు అదుపు అయ్యే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

రేషన్ బియ్యంలో పోషక విలువలు

జిల్లా అధికార యంత్రాంగం అవగాహన

రేషన్ బియ్యంలో పోషక విలువలు దాగి ఉన్నాయని జిల్లా అధికార యంత్రాంగం ఇటీవల పెద్ద ఎత్తున అవగాహన కల్పించింది. ఆగస్టు 8వ తేదీన డిఆర్‌డిఎ, మెప్మా, సిడిఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో రేషన్ బియ్యంతో 108 వంటకాలు తయారీ పోటీలను ఏర్పాటు చేసి అవగాహన చేపట్టింది. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి సంయుక్తంగా వంటకాల పోటీలను పరిశీలించి రుచి చూశారు. రేషన్ బియ్యాన్ని తక్కువగా భావించడం సరికాదని, ప్రస్తుతం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంలో పోషక విలువలతో కూడిన ఫోర్టిఫైడ్ కెర్నల్స్‌ను కలపడం ద్వారా ఈ బియ్యం వినియోగించిన లబ్ధిదారులకు ఐరన్, విటమిన్ బి12, ఫోలిక్ యాసిడ్ సంపూర్ణంగా అందుతాయని అవగాహన కల్పించారు.

ఉత్సాహం.. ఉద్రిక్తత నడుమ యువగళం

సమస్యలు వింటూ.. హామీలిస్తూ ముందుకు సాగిన లోకేష్

వైసిపి శ్రేణుల కవ్వింపుతో తుక్కులూరులో ఘర్షణ

మామిడి, పామాయిల్ రైతులతో ముఖాముఖి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్, ముసునూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఏలూరు జిల్లాలో తొలిరోజు శుక్రవారం తెలుగు యువత ఉత్సాహం నడుమ, వైసిపి కార్యకర్తల కవ్వింపులతో తీవ్ర ఉద్రిక్తతల నడుమ సాగింది. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం నుంచి ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం మీర్జాపురం గ్రామానికి యువగళం పాదయాత్ర గురువారం రాత్రి చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ పాదయాత్ర 194వ రోజు శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర గంటల ప్రాంతంలో మీర్జాపురం నుంచి ప్రారంభమైంది. ఆ గ్రామంలో పలుచోట్ల మహిళలతో లోకేష్ ముచ్చటించారు. అనంతరం యాత్ర గొల్లపల్లి గ్రామం చేరుకోగా నాలుగు రోడ్ల కూడలి వద్ద గజమాలతో మహిళలు లోకేష్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లోకేష్ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న ప్రయివేటు స్కూల్ విద్యార్థులతో సెల్ఫీలు దిగారు. అనంతరం మోర్సపూడి గ్రామానికి యాత్ర చేరుకోగా వేర్వేరు సెంటర్లలో మామిడికాయలు, కొబ్బరికాయలతో కూడిన గజమాలలు వేసి యాత్రకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి బయల్దేరిన యాత్ర మోర్సపూడి మీదుగా తుక్కులూరు చేరుకోగా మహిళలు ఘన స్వాగతం పలికారు. తుక్కులూరులోనే భోజన విరామానికి ఆగారు. అనంతరం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో నూజివీడు శివార్లలో మార్కెట్ యార్డు సమీపంలో మామిడి, పామాయిల్ రైతులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మిర్చి, పొగాకు పంటల మాదిరిగా మామిడి పంటకు కూడా బోర్డు పెట్టాలని కోరారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ తాము అధికారంలోకి రాగానే మామిడి బోర్డు పెడతామని, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అక్కడి మామిడి రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలు మన రాష్ట్రంలోని మామిడి రైతులకు అందిస్తామని హామీ ఇచ్చారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బిగించడాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని, మీటర్లు పెట్టేందుకు సమ్మతిస్తూ సంతకాలు పెట్టొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. జగన్‌కు రైతుల సమస్యలపై అవగాహన లేదని, బటన్ నొక్కడం తప్ప ఆయనకు ఇంకేమీ తెలీదని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పామాయిల్ రైతులకు అద్భుతమైన గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పారు. అనంతరం పాదయాత్ర నూజివీడు పట్టణంలోని పలు ప్రధాన కూడళ్ల మీదుగా సాగి నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లె చేరుకుంది. రాత్రికి యాత్ర అక్కడే బస చేసింది.



మహిళలతో మాట్లాడుతున్న లోకేష్

తుక్కులూరు వద్ద తీవ్ర ఉద్రిక్తత

యువగళం పాదయాత్ర తుక్కులూరు సెంటర్ వద్ద వైసిపి నేత కొలుసు కాసులు ఇంటి వద్దకు వచ్చేసరికి నలుగురైదుగురు వైసిపి కార్యకర్తలు తమ పార్టీ జెండాలు ఊపుతూ సైకో జగన్ పాట ఆపాలంటూ నినాదాలు చేశారు. దీన్ని యువగళం వాలంటీర్లు ప్రతిఘటించడంతో ఘర్షణ చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కొందరు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని యువగళం టీమ్ సభ్యులను నిలువరిస్తూ వైసిపి శ్రేణులను అక్కడి నుంచి పంపించేయడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఈ ఘర్షణలో ఇద్దరు పోలీసులకు స్వల్ప గాయాలవ్వగా రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘర్షణపై టిడిపి నేత మాజీ మంత్రి కొత్తపల్లి జవహర్ కుమారుడు ఆశిష్, మరో నేత వెంకటప్ప వైసిపి నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు రశీదు ఇవ్వకపోవడంతో టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు ఫిర్యాదు అందినట్లు రశీదు ఇవ్వడంతో ఆందోళన విరమించారు. టిడిపి నేతల ఫిర్యాదులో కొందరు వైసిపి నేతల పేర్లు పేర్కొంటూ వారు ఉద్దేశపూర్వకంగా బీరుసీసాలు, రాళ్లతో పాదయాత్రలోకి చొరబడి దాడి చేశారని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో వైసిపి నేతలు కవ్వింపు చర్యలకు దిగే అవకాశం ఉందని ముందస్తుగా పోలీసులకు చెప్పినప్పటికీ వైసిపి నేతలను పోలీసులు అడ్డుకోలేదని టిడిపి నేతలు విమర్శించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై సమరభేరి

ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు - సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సమరభేరి నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ నిరసనలో జిల్లా ప్రజానీకం పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వాసుదేవరావు అధ్యక్షతన జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం సమర భేరి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలపై పన్నుల భారాలను విపరీతంగా మోపి, ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. తన విధానాలను అమలు చేయకపోతే అప్పులు చేయడానికి కూడా అనుమతులు లేకుండా రాష్ట్రాల హక్కులపై దాడి చేస్తోందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ధరల కోరల్లో చిక్కుకుపోయారన్నారు. ధరలను అదుపు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం బడా వ్యాపారులు, కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ ధరలను అదుపు చేసే చర్యలు చేపట్టడం లేదన్నారు. విద్య, వైద్యం కోసం లక్షల రూపాయలు ఖర్చు పెట్టాల్సి రావడంతో ప్రజలు అప్పుల ఊబిలో



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బలరాం, నేతలు

కూరుకుపోయారన్నారు. మోడీ అధికారంలోకి వస్తే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చి దాని గురించి మర్చిపోయారని విమర్శించారు. ఉపాధి హామీని సైతం నీరుగారుస్తూ, క్రమంగా ఎత్తేయాలనే ఉద్దేశంతో నిధులు తగ్గిస్తోందని విమర్శించారు. ఫ్యాక్టరీలు మూతపడడం వల్ల కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. రాష్ట్రానికి విభజన సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీనీ బిజెపి ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నా రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం మోడీ భజన చేస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ హామీని గాలికొదిలేసి 7 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారన్నారు. వెంటనే వాటిని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా జరిగే నిరసనల్లో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, జెఎన్‌వి.గోపాలన్, కేతా గోపాలన్, కవురు పెద్దిరాజు, దూసి కళ్యాణి, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు, దేశ ప్రజలకు అభినందనలు

సిపిఎం జిల్లా కమిటీ హర్షం

ఇస్రో శాస్త్రవేత్తలకు, దేశ ప్రజలకు సిపిఎం జిల్లా కమిటీ అభినందనలు తెలిపింది. చంద్రయాన్-3 విజయవంతం పట్ల సిపిఎం జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడారు. ఎన్నో దశబ్దాల తర్వాత చంద్రునిపై మన దేశం విజయవంతంగా అడుగుపెట్టడం భారతీయులందరూ గర్వించదగ్గ విషయమన్నారు. భవిష్యత్‌లో ఇస్రో మరిన్ని ప్రయోగాలు విజయవంతం కావాలని, తద్వారా శాస్త్ర విజ్ఞానం విరాజిల్లాలని బలరాం ఆకాంక్షించారు.

అల్లుఅర్జున్‌కు అవార్డు రావడం అభినందనీయం..

జై భీమ్ సినిమాకు అవార్డు రాకపోవడం బాధాకరం..

హీరో అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు రావడం అభినందనీయమని జిల్లా కార్యదర్శి బలరాం తెలిపారు. పుష్ప సినిమా రెండు అవార్డులు గెలుచుకొని తెలుగు సినీ పరిశ్రమకు కీర్తి గడించి పెట్టిందన్నారు. అలాగే ఉప్పెన, త్రిబుల్ ఆర్ చిత్ర బృందానికి, అవార్డులు తెచ్చిన నటీ నటులు, సాంకేతిక నిపుణులకు ఆయన అభినందనలు తెలిపారు. అదే సమయంలో అత్యంత సామాజిక స్పృహతో తీసిన గొప్ప చిత్రం జైభీమ్‌కు ఒక్క అవార్డు కూడా ఇవ్వకపోవడం విచారకరమన్నారు. ఇది జాతీయ అవార్డుల పట్ల గౌరవాన్ని తగ్గిస్తుందన్నారు. ఈ సినిమాకు ప్రత్యేక అవార్డు ప్రకటించాలని ఆయన జ్యూరికి విజ్ఞప్తి చేశారు.

భీమవరంలో కలెక్టర్ విస్తృత పర్యటన

వివిధ పనుల పరిశీలన

ప్రజాశక్తి - భీమవరం

పట్టణంలో చేపట్టిన పలు మున్సిపల్ పనులను, ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణను శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జెపి రోడ్డు అయ్యప్ప స్వామి టెంపుల్ 34వ వార్డు ప్రాంతంలోని రోడ్డు మార్జిన్‌లోని డ్రెయిన్‌ను పరిశీలించారు. డ్రెయిన్ నిర్మాణం కారణంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. అనంతరం 20వ వార్డులోని ఎడ్వర్డ్ ట్యాంక్ వద్ద డ్రెయిన్‌ను పరిశీలించారు. డ్రెయిన్ పనులను త్వరితగతిన చేపట్టాలని, ఎడ్వర్డ్ ట్యాంకు చుట్టుపక్కలా మొక్కలు నాటించాలని తెలిపారు. అనంతరం బిసి కాలనీలో అమృత్ 2.0 నిధులు రూ.2.14 కోట్లతో నిర్మించిన 10 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకును సందర్శించారు. త్వరగా పైపులైను పనులను పూర్తిచేసి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకు ముందు భాగంలో ఖాళీగా ఉన్న ప్రాంతంలో మొక్కలు నాటించాలని సూచించారు. వాటర్ ట్యాంకు మార్గంలో రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఒకటో వార్డు సిపిఎం కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డు వరకూ రోడ్డు విస్తరణ పనులను, వంతెన ప్రాంతాన్ని సందర్శించారు. వంతెన మార్జిన్‌లో నీరు నిలవకుండా ఉండేలా పనులను చేపట్టాలన్నారు. శ్రీఅడబాల వెంకట చంద్రరావు మున్సిపల్ స్పెషల్ ప్రాథమిక పాఠశాల వద్ద ఓటర్ల సర్వేపై బిఎల్ఒలతో మాట్లాడారు. కొత్త ఓట్లకు ఎన్ని దరఖాస్తులందాయి, ఎన్ని ఎన్రోల్ చేశారు, డెత్ కేసులు, షిఫ్టెడ్ కేసులు, 100 సంవత్సరాలు వయసు పైబడి ఉన్నవారు ఎంతమంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ త్రినాధరావు, ఇన్‌ఛార్జి మున్సిపల్ డిఇ, పబ్లిక్ హెల్త్ ఇఇ విజయ్, ఎఇ నవ్య, మున్సిపల్ అధికారులు ఉన్నారు




అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

సిద్ధాని శ్రీనివాస్‌కు పలువురి అభినందన

చంద్రయాన్-3 ప్రాజెక్టు శాస్త్రవేత్తల్లో ఆయన కూడా ఒకరు

ప్రజాశక్తి - పాలకొల్లు

చంద్రయాన్-3 విజయంలో ఎంతో మంది శాస్త్రవేత్తలు భాగస్వామ్యులయ్యారు. ఆ శాస్త్రవేత్తల్లో మండలంలోని దగ్గులూరుకు చెందిన సిద్ధాని శ్రీనివాస్ కూడా ఉన్నారు. చేనేత కార్మికుడు సోమేశ్వరరావు కుమారుడు శ్రీనివాస్ శ్రీహరికోటలోని అంతరిక్ష పరిశోధన సంస్థలో పని చేస్తున్నారు. ఆయన ప్రాథమిక విద్య దగ్గులూరు, కళాశాల విద్య పాలకొల్లులో సాగింది. గుడ్లవల్లేరు లో బిటెక్, హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో



సిద్ధాని శ్రీనివాస్

ఎంటెక్ పూర్తి చేసి ప్రస్తుతం శ్రీహరికోటలోని అంతరిక్ష పరిశోధన సంస్థలో పని చేస్తున్నారు. చంద్రయాన్-3 ప్రాజెక్టులో ప నిచేసేన వారిలో ఆయన ఒకరు.

పలువురి అభినందనలు

శ్రీనివాస్‌ను ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి, మాజీ ఎంఎల్‌సిలు మేకా శేషుబాబు, అంగర రామ్మోహన్, గ్రామ సర్పంచి విశ్వనాథం పేరయ్య, గ్రామ కార్యదర్శి మల్లేశ్వరరావు అభినందించారు.

టిటిడి బోర్డు మెంబర్‌గా మేకా శేషుబాబు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లుకు చెందిన మాజీ ఎంఎల్‌సి, జెడ్‌పి మాజీ ఛైర్మన్ మేకా శేషుబాబు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పాలకొల్లు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల తరువాత కవురు శ్రీనివాస్‌కు, ఇప్పుడు గుడాల గోపికి వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవులు దక్కాయి.. ప్రస్తుతం మేకా శేషుబాబుకు సముచిత గౌరవం ఇచ్చినందుకు ఆయన అనుయాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. .



మేకా శేషుబాబు

వాండ్రంలో ఇరు గ్రూపుల మధ్య సమసిన వివాదం

ఉండి : వారం రోజుల క్రితం మండలంలోని వాండ్రం గ్రామంలోని దళితులకు, అగ్రవర్ణాలకు మధ్య జరిగిన వివాదాల్లో కొందరు గాయపడడం, మరికొందరు ప్రార్థన మందిరం అద్దాలు పగలగొట్టడంతో వివాదం చిలికి చిలికి గాలి వానగా మారింది. దీంతో గ్రామంలో ఆర్‌డిఒ దాసిరాజు, భీమవరం డిఎస్‌పి బండారు శ్రీనాథ్ బృందం పర్యటించి శాంతి కమిటీని ఏర్పాటు చేసినా బయటి సంఘాలు గ్రామంలో అలజడి సృష్టించడంతో నాటి నుంచి సుమారు నెల రోజుల వరకు 144 సెక్షన్, పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసిన విషయం విదితమే. శుక్రవారం వాండ్రం గ్రామ మాజీ సర్పంచులు రెడ్డిపల్లి సత్యనారాయణ, కందుల రాధా బలరామకృష్ణ, ఎంపిటిసి సభ్యులు పెన్మెత్స ఆంజనేయరాజు దళిత నాయకులతో చర్చలు జరపడంతో వివాదం సద్దుమణిగిందని గ్రామస్తులు తెలిపారు. అనంతరం రెడ్డిపల్లి సత్యనారాయణ, కందుల రాధా బలరామకృష్ణ,



వివాదానికి స్వస్తి పలుకుతూ చేసిన తీర్మాన పత్రాలను సిఐకు అందిస్తున్న గ్రామ పెద్దలు

దళిత సంఘ పెద్ద కోణాల రాజేంద్ర మాట్లాడుతూ తమ గ్రామంలో కుల, మతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ అన్నదమ్ముల్లాగా ఐకమత్యంగా కలిసిమెలిసి ఉండేవారమని, కాని కొందరు ఆకతాయి యువకుల అలజడి వల్ల గ్రామంలో ఒక్కసారిగా వివాదాలు చెలరేగాయని, వీటికి స్వస్తి పలకడానికి గ్రామంలోని అన్ని సంఘాల వారు ఏకమయ్యామని, ఇక మీదట గతంలోలాగా కలిసిమెలిసి ఉంటామనితెలిపారు. అనంతరం ఆకివీడు సిఐ కెవివిఎన్.సత్య నారాయణ, ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు మాట్లాడుతూ గ్రామంలో ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసే వరకు 144 సెక్షన్, పోలీస్ పికెటింగ్ ఉంటాయన్నారు. గ్రామంలోని పెద్దలందరూ ఏకమై ఈ వివాదాలకు స్వస్తి పలికినట్లు తమకు రాతపూర్వకంగా తీర్మానం ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గేదెల నర్సింహమూర్తి, యనమల రాము, సందక శ్రీనివాస్, బొంగురోతు నారాయణ, పచ్చా నరసింహం, చంద్రయ్య, మందా శ్రీనివాసరావు, కోణాల సంజీవరావు, విప్పర్తి మహేష్, పినిపే సువర్ణరాజు, గోరింకల ఏసేబు, దీసిల్ల వెంకటరత్నం, మందా ఏసుపాదం, కోణాల మహంకాళి, మత్తె జేమ్స్ గ్రామంలో చెలరేగిన వివాదానికి స్వస్తి పలికినట్లు మద్దతుగా తీర్మానంలో పాల్గొన్నారు.

మణిపూర్‌లో బాధితులకు న్యాయం చేయాలి

ఆవాజ్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరుల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - పెనుమంట్ర

మణిపూర్‌లో బిజెపి సాగిస్తున్న దాడులకు, అఘాయిత్యాలకు బలైనవారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మార్టేరు జమాద్ ముస్లిం సోదరులు ఆవాజ్ సంఘం ఆధ్వర్యంలో మార్టేరు సెంటర్‌లో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. మణిపూర్‌లో హత్యలకు, అఘాయిత్యాలకు గురైన కుటుంబాలకు న్యాయం చేయాలని, రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడాలని, లౌకిక రాజ్యాన్ని బలోపేతం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆవాజ్ సంఘం నాయకులు షేక్ పాదుషా మాట్లాడుతూ దేశంలో మానవ హక్కులు కాపాడే విధంగా ప్రజల మధ్య ఐక్యత సాధించాలని, హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులంతా ఐక్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని కేంద్ర ప్రభుత్వం గ్రహించాలన్నారు. మణిపూర్‌లో జరిగిన అరాచకాలకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, బాధితులకు, నష్టపోయిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జామియా నూర్ మసీదు కమిటీ సభ్యులు గౌస్ మొహిద్దీన్, ముక్తార్ అహమద్, ఇమామ్ అబ్దుల్లా, జహంగీర్, లాల్ సాహెబ్, సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శనలో ముస్లిం సోదరులు

30 నుంచి సమరభేరి యాత్ర : సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 30వ తేదీ నుంచి సెప్టెంబర్ నాలుగో తేదీ వరకు సిపిఎం చేపడుతున్న సమరభేరి యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం నవపురం సెంటర్ వద్ద విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అధిక ధరలను అరికట్టలేక, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించలేక ఘోరంగా విఫలమైందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే పెట్రోల్ రూ.40, గ్యాస్ రూ.400 ఇస్తామంటూ మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భారాలకు వ్యతిరేకంగా సిపిఎం దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు గ్రామాల్లో కరపత్రాలు పంచి సంతకాల సేకరణతో పాటు సెప్టెంబర్ ఒకటో తేదీన సచివాలయాల వద్ద ధర్నాలు, మూడో తేదీన నిరుద్యోగ వ్యతిరేక దినం, నాలుగో తేదీన మండల కార్యాలయం వద్ద జరిగే ధర్నాల కార్యక్రమాలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేతా జ్యోతిబసు, లింగం సత్యనారాయణ, యాళ్లబంది నారాయణమూర్తి, పాలా కోటేశ్వరరావు, అయినపూడి బాబూరావు, మైగాపుల త్రిమూర్తులు, బలుసుపల్లి నూకరాజు, బొంతు రామారావు పాల్గొన్నారు.

గణపవరం : సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ నుంచి సెప్టెంబర్ నాలుగో తేదీ వరకు జరిగే దేశవ్యాప్త కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. గణపవరం పార్టీ కార్యాలయంలో ఎస్.సంజీవరావు అధ్యక్షత వహించిన శుక్రవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక ధరలపై ప్రజల వద్ద నుంచి సంతకాలు సేకరించి సెప్టెంబర్ ఒకటో తేదీన స్థానిక సచివాలయ కార్యదర్శులకు అందించాలన్నారు. సెప్టెంబర్ నాలుగో తేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మోడీ అధికారంలోకొచ్చాక ప్రజలపై మోయలేని భారాలు మోపారన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి, పి.గోవిందు, కె.త్రినాథ్, బి.ఎర్రినాయుడు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తెలుగు మహాకవుల రచనలు యుగాంతం వరకు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, కెజిఆర్ఎల్ కళాశాల తెలుగు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను, భావోద్యమ నాయకులు గిడుగు రామ్మూర్తి జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తెలుగు మహాకవుల చిత్రపటాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మెంటే హరినాథ్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల తెలుగు శాసనాల లిపిలో తెలుగు భాష కనిపించిందని, అటువంటి తెలుగు భాషకు ప్రపంచంలోనే గుర్తింపు ఉందని, ఈ భాషను ప్రాచీన భాషగా గుర్తించటాన్నారు. తెలుగు పండితులు కలిగొట్ల గోపాలకృష్ణ మాట్లాడుతూ తెలుగు భాష అనంతమైనదన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ కళాశాలలో రెండో సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు కవితా పోటీలు నిర్వహించామని, బిజిలి, అనిల్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని, 29న బివి.రాజు పార్కులోని తెలుగు తల్లి విగ్రహం వద్ద ముగింపు వేడుకల్లో బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి నామ శ్రీనివాస్, కళార రంజని అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్, అరసవల్లి సుబ్రహ్మణ్యం, మెంటే పూర్ణచంద్ర రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.గంగాధరరావు, కె.ఛాయా, జ్యోతి పాల్గొన్నారు.

అందరికీ సొంతిల్లు ఉండాలి : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా సిఎం జగన్ పనిచేస్తున్నారని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో నియోజకవర్గంలో జరుగుతున్న గృహ నిర్మాణాలపై శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ సిఎం జగన్ పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రాష్ట్రంలో సుమారుగా 30 లక్షల మందికి పైగానే ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు కూడా ఇచ్చారన్నారు. అంతేకాకుండా గృహ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం రూ.1.80 లక్షల రుణం ఇవ్వడంతో పాటు బ్యాంకుల నుంచి రూ.30 వేల వరకు రుణాలు కూడా అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. స్థలాలు పొందిన లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మించుకుని గృహ ప్రవేశాలు చేసుకోవాలన్నారు. భీమవరం నియోజకవర్గంలో దాదాపుగా 15 వేల మందికి పైగానే పేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసి పట్టాలు ఇచ్చినట్లు చెప్పారు. వీరిలో ఎక్కువ శాతం మంది గృహ నిర్మాణాలు జరుపుకుంటున్నారన్నారు. మిగిలిన లబ్ధిదారులు కూడా గృహ నిర్మాణాలు చేసుకునేలా హౌసింగ్ అధికారులు వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి జి.వేణుగోపాల్, మున్సిపల్ ఎంఇ త్రినాధరావు, ఎంపిడిఒ వెంకటప్పారావు, ఎఇలు శశి కుమార్, మూర్తి పాల్గొన్నారు.

పాటదారుడి నుంచి ఫెర్రీ స్వాధీనం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ప్రభుత్వ నిబంధనలు పాటించని, బకాయి సొమ్ము చెల్లించని పాటదారుడు నుంచి ఫెర్రీని స్వాధీనం చేసుకుంటామని వెళ్లిన అధికారులకు పాటదారుడు చుక్కలు చూపించాడు. ఫెర్రీరేవుకు సంబంధించిన జాయింట్ యాక్షన్ కమిటీ పాటదారుడుకు గురువారం సాయంత్రం వరకు గడువు ఇచ్చారు. అయినప్పటికీ పాటదారుడు ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడంతో అధికారులతో పాటు జాయింట్ యాక్షన్ కమిటీ రద్దు చేసింది. శుక్రవారం ఫెర్రీని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు వేలం నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం వెళ్లిన సిబ్బందిని పాటదారుడు అడ్డుపడ్డారు. మరో అవకాశం ఇవ్వాలంటూ పాటదారుడు పట్టుపట్టాడు. సిబ్బందిని కూడా రానివ్వకుండా పాటదారులు అడ్డు పడుతున్నట్లు సిబ్బంది ఎంపిడిఒ శివప్రసాద్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎంపిడిఒ రేవు వద్దకు చేరుకొని పాటదారుడితో చర్చించారు. పాటదారుడి నుంచి ఫెర్రీని స్వాధీనం చేసుకుని రాకపోకలు నిర్వహించారు. సెప్టెంబర్ ఐదో తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు ఫెర్రీ రేవు టోలు వసూళ్లకు షీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం పాట ప్రక్రియను సెప్టెంబర్ నాలుగో మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

ప్రజాశక్తి - గణపవరం

గ్రామంలో ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.సంతోష్‌నాయుడు అన్నారు. డ్రైడే సందర్భంగా అర్ధ సచివాలయాల వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సచివాలయ పరిధిలో స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జూలాల విల్సన్‌బాబు, హెల్త్ అసిస్టెంట్లు ఎ.కృష్ణ, జి.శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిన్నూరులో దంత, కంటి వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

యూత్ హాస్టల్స్ ఆఫ్ ఇండియా 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోడూరు మండలంలోని జిన్నూరులో ఈ నెల 26వ తేదీ శనివారం జిన్నూరులోని ఐడియల్ కాన్వెంట్‌లో ఉచిత దంత, కంటి వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షులు పెద్దిరెడ్డి లక్ష్మీనారాయణ, జాతీయ సభ్యులు కారుమూరి సూర్యనారాయణ చెప్పారు. కంటి వైద్య శిబిరంలో పాలకొల్లు లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు పాల్గొంటారని చెప్పారు. దంత వైద్య శిబిరంలో డాక్టర్ చల్లా మాధుర్, డాక్టర్ కావలి మౌని పాల్గొంటారని చెప్పారు. ఈ అవకాశాన్ని జిన్నూరు పరిసర గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఐక్యంగా ఉంటేనే విజయం

ప్రజాశక్తి - మొగల్తూరు

ఐక్యంగా ఉంటే సాధించలేనిది ఏదీ లేదని బిసి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్ అన్నారు. మొగల్తూరులో సంఘ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మామిడిశెట్టి సత్యనారాయణ, బస్సిని ఏడుకొండలు, పాలా రాంబాబు, కొల్లాటి భోగరాజు, దంపనబోయిన సత్యనారాయణ, పితాని శేఖర్, చెల్లబోయిన పెద్దిరాజు, పొన్నపల్లి శివ, చింతాజ్ గంగాధరరావు, వెలిగట్ల శ్రీను పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తాము ముందడుగు వేస్తామని ఎంఎల్ఎ మంతెన రామరాజు, ఎంపీ రఘురామకృష్ణంరాజు తనయుడు భరత్‌లు అన్నారు. అన్నారు. మండలంలో ఎంపీ నిధులతో నిర్మించిన పలు సిమెంట్ రోడ్లను ఎంపీ రఘురామకృష్ణంరాజు తనయుడు భరత్‌తో కలిసి ఎంఎల్ఎ మంతెన రామరాజు శుక్రవారం ప్రారంభించారు. మండపాడులో రూ.ఐదు లక్షలతో నిర్మించిన 90 మీటర్ల రోడ్డు, దుంపగడప బోసురాజు కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించిన 176 మీటర్ల రోడ్డు, ఉప్పుటేరు వద్ద మరో రూ.ఐదు లక్షలతో నిర్మించిన 90 మీటర్ల రోడ్డును ప్రారంభించారు. మండల కేంద్రం ఆకివీడులో శ్మశానానికి రహదారి కోసం రూ.పది లక్షలతో నిర్మించిన వంద మీటర్ల సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మందపాడు, దుంపగడప గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, టిడిపి మండల అధ్యక్షులు మోటిపల్లి రామవరపు ప్రసాద్, మండల కార్యదర్శి నౌగోట్ల రామారావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బొల్లం వెంకట్రావు, గంధం ఉమా సత్యనారాయణ, టిడిపి జిల్లా నాయకులు పెన్మమరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్లకు డిజైన్లు ఖరారు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

యనమదుర్రు డ్రెయిన్‌పై నిరుపయోగంగా ఉన్న వంతెనలకు సంబంధించి అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి డిజైన్లు ఖరారు చేసినట్లు తెలుస్తుంది. ఆర్అండ్‌బి శాఖ ఎస్ఇ జాన్ మోషే, ఇఇ లోకేశ్వరరావు, డిఇ రామరాజు, కన్సల్టెంట్ రామకృష్ణ శుక్రవారం మరోసారి ఈ వంతెనలను పరిశీలించి, అనంతరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అధికారులతో, కన్సల్టెంట్‌తో సుదీర్ఘంగా చర్చించి డిజైన్లను ఖరారు చేసినట్లు తెలిసింది. ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఖరారు చేసిన డిజైన్లకు ప్రభుత్వం అతి త్వరలోనే అనుమతులు ఇవ్వనుంది. ఇప్పటికే వంతెనలకు సంబంధించి రూ.36 కోట్ల నిధులు మంజూరవ్వడంతో త్వరలోనే టెండర్ ప్రక్రియ జరగనుంది.

గర్భాశయ కేన్సర్ రాకుండా ఉచితంగా వ్యాక్సిన్

జనసేన జిల్లా కార్యదర్శి నరసయ్య

ప్రజాశక్తి - పాలకొల్లు

గర్భాశయ కేన్సర్ బారిన పడకుండా పాలకొల్లు నియోజకవర్గ మహిళలకు ఉచితంగా వ్యాక్సిన్ వేయిస్తానని జనసేన జిల్లా కార్యదర్శి బోనం నరసయ్య ప్రకటించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ మహిళలు గర్భాశయ కేన్సర్‌తో ఇక్కట్లు పడుతున్నారని చెప్పారు. తన తల్లి కూడా ఈ కేన్సర్‌తో బాధపడిందన్నారను. పాలకొల్లులో ఏ మహిళా ఇబ్బంది పడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో తమ సంపాదనలో కొంత పేదలకు ఖర్చు చేయాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఈ వ్యాక్సిన్ రూ.3500 నుంచి రూ.నాలుగు వేల వరకు ఉందని అయితే సీరం ఇన్‌స్టిట్యూట్ రూ.వెయ్యికి అందిస్తామని ప్రకటించారని, ఇది అందుబాటులోకి వచ్చిన వెంటనే మహిళలకు అందిస్తానని చెప్పారు. ఈ వ్యాక్సిన్ ఏడాదిలో రెండు సార్లు వేయాల్సి ఉంటుందని తెలిపారు.

'టిడిపితోనే మహిళాభ్యున్నతి'

ప్రజాశక్తి - పెనుమంట్ర

మహిళలు అభ్యున్నతి సాధించాలంటే టిడిపి అధికారంలోకి రావాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ తనయుడు వెంకట్ అన్నారు. మండలంలోని సత్యవరంలో శుక్రవారం మహిళాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ ప్రజలకు మినీ మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి (బుల్లాలు), వెలగల బులిరామిరెడ్డి, కర్రి అచ్యుత రామారెడ్డి, చింతపల్లి రామకృష్ణ, వివేకానంద రెడ్డి, కడలి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వికలాంగులకు మూడు చక్రాల మోటార్ వాహనాలు పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

వికలాంగులకు ప్రభుత్వం మూడు చక్రాల మోటార్ వాహనాలు ఉచితంగా అందించడం అభినందనీయమని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. పెదఅమిరం వైసిపి కార్యాలయంలో ఉండి నియోజకవర్గానికి సంబంధించి వికలాంగులకు మంజూరైన పది మోటార్ వాహనాలను డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు చేతులమీదుగా శుక్రవారం అందించారు. పాలకోడేరు మండలంలో ముగ్గురికి, ఆకివీడులో ఇద్దరికి, ఉండిలో ముగ్గురికి, కాళ్లలో ఇద్దరికి మూడు చక్రాల మోటార్ వాహనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండలాల జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిటిసి సభ్యులు, పార్టీ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని కృష్ణయ్యపాలెంలో గ్రామంలో రైతులకు ఆత్మ పథకం కింద వ్యవసాయ పద్ధతులపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ అవసరాన్ని బట్టి పురుగుమందులు, ఎరువులు వాడాలని సూచించారు. రైతులు మారిన కాలానికి అనుగుణంగా మేలైన పద్ధతులు పాటించాలన్నారను. మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రైతు ఇక్రాప్ నమోదు, ఇ కెవైసి చేయించుకోవాలని తెలిపారు. రైతు భరోసా, పిఎం కిసాన్ పడని రైతులు ఎవరైనా ఉంటే తక్షణం రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు. 40 శాతం రాయితీపై రైతు గ్రూపులకు డ్రోన్లు అందిస్తామని, డ్రోన్లు నడపటానికి పైలెట్‌కు 15 రోజుల శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. రైతులతో ప్రస్తుత వ్యవసాయ వాతావరణ పరిస్థితులపై చర్చించారు. ఎఇ ఆర్ఎస్ ప్రసాద్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఆంజనేయులు, రైతులు ఉమా రామకృష్ణ, శివయ్య, శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ పరిశీలన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు బ్రాడీపేట వద్ద ఉన్న మంచినీటి కుళాయి చెరువును, నూతనంగా నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను వైసిపి పాలకొల్లు ఇన్‌ఛార్జి గుడాల గోపి శుక్రవారం సందర్శించారు. ప్లాంట్ ప్రారంభిస్తే పాలకొల్లు చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో ప్రజలకు, పట్టణ వాసులకు ఇబ్బంది లేకుండా తాగునీరు సరఫరా చేయవచ్చన్నారు. ఆయనతో పాటు డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల.తాతాజీ, పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు, చినిమిల్లి గణపతి, మున్సిపల్ డిఇ సాంబశివుడు, ఇజ్జాడ చినబాబు, పెచ్చెట్టి కృష్ణాజీ, పాలపర్తి కృపానంద్, ఏడుకొండలు, కోళ్ల వెంకట్, శ్రీను పాల్గొన్నారు.

విస్సాకోడేరు సర్పంచి శ్రీనివాస్‌కు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - భీమవరం

రాజీవ్ గాంధీ జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డును అందుకున్న విస్సాకోడేరు గ్రామ సర్పంచి బి.శ్రీనివాస్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంతిని విస్సాకోడేరు గ్రామ సర్పంచి బి.శ్రీనివాసరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సర్పంచి శ్రీనివాస్‌ను కలెక్టర్ ప్రశాంతి ప్రత్యేకంగా అభినందించారు. విస్సాకోడేరు గ్రామ పంచాయతీని శానిటేషన్ రంగంలో అందరికీ ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దినందుకు రాజీవ్‌గాంధీ నేషనల్ అవార్డు కోసం జిల్లా యంత్రాంగం నుంచి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రతిపాదనల పరిశీలన అనంతరం గ్రామాన్ని రాజీవ్‌గాంధీ నేషనల్ బెస్ట్ గ్రామపంచాయతీ అవార్డుకు ఎంపిక చేశారన్నారు. అవార్డును ఆగస్టు 19న బెంగళూరులోని గాంధీభవన్‌లో అకాడమీ ఆఫ్ గ్రాస్ రూట్స్ స్టడీస్, రీసెర్చ్ ఆఫ్ ఇండియా వారి చేతుల మీదుగా సర్పంచి శ్రీనివాస్ అందుకున్నారన్నారు. జిల్లా పంచాయతీ శాఖాధికారి జివికె.మల్లికార్జునరావు, డిపిఆర్‌సి ఎన్.ఎడ్వర్డ్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఉన్నారు.



కలెక్టర్ ప్రశాంతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సర్పంచి శ్రీనివాస్

తామరాడలో కొనసాగుతున్న వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని తామరాడలో విషజ్వరాలు సోకి పలువురు అనారోగ్య పాలు కావడంతో అధికారులు గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం అడిషనల్ డిఎంహెచ్ఒ సుగుణరాజు గ్రామంలో పర్యటించి ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో పూర్తిగా సున్నా కేసులు వచ్చేవరకు ఆరోగ్య శిబిరాలు కొనసాగాలని, ఎప్పటికప్పుడు ప్రతి ఇంటిని సర్వే చేసి తమకు సమాచారం అందించాలని తెలిపారు. స్థానికులతో మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య మెరుగుదలకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఇంటి బయట ఆవరణలోనే కాకుండా ఇళ్లలో కూడా దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి పావని, ఎంపిహెచ్ఒ బృందేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామంలో పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

లబ్ధిదారులు ఆందోళన చెందొద్దు

గృహ నిర్మాణ సొసైటీ అధ్యక్షులు సుబ్బరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక శ్రీహరిపురం డిటిసిపి ఆమోదంతో 27 ఎకరాల్లో సొసైటీ ఏర్పాటు చేసిన లే అవుట్‌లో రూ.కోట్లలో అక్రమాలు జరిగినట్లుగా అసత్యం, నిరాధార ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, గృహ నిర్మాణ సొసైటీ అధ్యక్షులు అడ్డాల సుబ్బరాజు తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని ఆరో వార్డులో ఉన్న కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సొసైటీ 2021లో లే అవుట్ కోసం రైతులతో అగ్రిమెంట్లు చేసుకున్న తరువాత కెవిఎస్ ఎస్టేట్ తణుకు వారితో జరిగిన అవగాహన మేరకు వారే రైతులకు నేరుగా డబ్బు చెల్లించి భూములను వారి పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుని, జాయింట్‌గా లే అవుట్ పూర్తి చేసినట్లు చెప్పారు. వారి నుంచి సొసైటీ ఖాతాకు ఒక్క రూపాయి కూడా రాలేదన్నారు. ఈ లే అవుట్‌లో ప్లాట్లు 280, 74 వేల చదరపు గజాలు రూ.తొమ్మిది వేల చొప్పున మొత్తం బడ్జెట్ రూ.66.60 కోట్లుగా ఉందని, మొత్తం 260 ప్లాట్ల సభ్యులకు కేటాయించగా, ఇప్పటివరకు 121 ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పూర్తయి రూ.32.35 కోట్లు సొమ్ము జమ అయిందని, 139 ప్లాట్ల బుకింగ్‌లో ఉండగా రూ.25.46 కోట్లు జమ అయిందని, రూ.57.81 కోట్లుగా వచ్చిందన్నారు. తమలో వచ్చిన వివాదాలు వల్ల ఎవరూ ఆందోళన చెందవద్దని, అన్ని సమస్యలను పరిష్కరించి ప్రతి ఒక్క లబ్ధిదారునికి న్యాయం చేస్తామని చెప్పారు. రిజిస్ట్రేషన్ల ఆలస్యం కావడం వల్ల లబ్ధిదారులు ఇటీవల ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను కలిసి సమస్యను వివరించామని, దీనిలో ఎంఎల్ఎ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను ఆపదించవద్దని సుబ్బరాజు కోరారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం : మంతెన



ఏలూరుపాడులో డ్రెయినేజీని ప్రారంభిస్తున్న రామరాజు, భరత్

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని ఏలూరుపాడులో రూ.20 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన డ్రెయినేజీని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు తనయకుడు భరత్ శుక్రవారం ప్రారంభించారు. తొలుత కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, ఆలయ ఇఒ మోకా అరుణ్‌కుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. జువ్వలపాలెంలో గోకరాజు శివరామరాజు ఆధ్వర్యంలో పలువురు టిడిపి నాయకులు ఎంఎల్ఎ రామరాజు, ఎంపీ తనయుడు భరత్, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజులకు మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఏలూరుపాడులో సాయిబాబా గుడి, గరువు ప్రాంతాలకు వెళ్లేందుకు రూ.ఎనిమిది లక్షలతో చేపట్టనున్న వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు, గ్రామ సర్పంచి భూపతి ాజు వెంకట జగ్గరాజు, మాజీ సర్పంచులు మంతెన ఆంజనేయరాజు, అడ్డాల శివరామరాజు, టిడిపి నాయకులు వక్కపట్ల హరిబాబు, సుధాబత్తుల వంశీకృష్ణ, ఎంపిటిసి మాజీ సభ్యులు పడమట సత్యనారాయణ పాల్గొన్నారు.

అల్లు అర్జున్‌కు జాతీయ అవార్డుపై హర్షం

ప్రజాశక్తి - పాలకొల్లు

అల్లుఅర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడు అవార్డు రావడంపై పాలకొల్లులో ఆయన అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. తులా రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబరాలు చేశారు. చిన్న కారుల స్టాండ్ సెంటర్‌లోని అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహనికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బాణసంచా కాల్చి, ప్రజలకు, అభిమానులకు స్వీట్స్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా తులా రామలింగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు సినీ చరిత్రలో 69 ఏళ్లుగా ఒక కలగా, లక్ష్యంగా ఉన్న జాతీయ ఉత్తమ నటుడు అవార్డును పాలకొల్లు ముదుబిడ్డ అల్లుఅర్జున్ సాధించడం చాలా ఆనంద దాయకమన్నారు. ఆనాడు అల్లు రామలింగయ్య పాలకొల్లు కీర్తిని ఇనుమడింపచేసి చిరస్థాయిగా నిలిచారని ఆయన మనవడిగా అల్లుఅర్జున్ ఘనత సాధించి తెలుగు సినీ పరిశ్రమకు, పాలకొల్లుకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారని, భవిష్యత్తులో మరెన్నో అవార్డులు సాధించాలని కోరారు. తెలుగు చిత్రపరిశ్రమకు వివిధ విభాగాల్లో అవార్డులు సాధించిన ఆర్ఆర్ఆర్, ఉప్పెన, కొండపొలం, పుష్ప చిత్రాల్లో పలు విభాగాల్లో అవార్డులు సాధించిన కీరవాణి, దేవిశ్రీప్రసాద్, చంద్రబోస్ తదితరులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు శిడగం సురేంద్ర, తులా సురేష్, ఆచంట దీపు, పువ్వల వెంకటేష్, కాపిశెట్టి పెదకాపు, మూర్తి, సాయి, గణేష్, ప్రముఖ నటులు అలుగు సత్తిబాబు, సాంబ, శ్రీను, వలవల ఆనంద్, పడాల గణేష్, మూర్తి, వెంకటేష్, సాయి, కోట్ల నవీన్ పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వాలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని 17వ వార్డులో శుక్రవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పాలన అందిస్తుంటే రాష్ట్రం అప్పులపాలు అయిపోతుందని ప్రతిపక్షాలు విషప్రచారం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో 32 లక్షల మందికి 72 వేల ఎకరాలు స్థలాలు కొని, పూడ్చి 2.25 లక్షల ఇళ్లు కట్టుకోడానికి సహాయం చేసిన ఘనత తమ ప్రభుత్వాని దేనన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శామ్యూల్, వైసిపి నాయకులు కె.ధర్మరాజు, కర్రి భాస్కరరావు, గుండుబోగుల నాగు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా కమిటీలో తాడేపల్లిగూడెం నుంచి ఏడుగురు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసిపి జిల్లా కమిటీలను ప్రకటించింది. పశ్చిమగోదావరి జిల్లా కమిటీలో తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి ఏడుగురికి చోటు దక్కింది. ఒక జిల్లా ఉపాధ్యక్షులు, ఒక జిల్లా కార్యదర్శి పదవితో పాటు ఐదుగురికి కార్యవర్గ సభ్యులుగా అవకాశం లభించింది. కొత్త కమిటీలో జిల్లా ఉపాధ్యక్షులుగా తెన్నేటి జగ్జీవన్‌రావు, జిల్లా కార్యదర్శిగా డి.లీలావతి, కార్యవర్గ సభ్యులుగా ముప్పిడి సంపత్ కుమార్, కర్రి సుధాకర్‌రెడ్డి, బొడ్డు సాయిబాబా, కట్టుబోయిన కృష్ణప్రసాద్, వెలనాటి సత్తిబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన తెన్నేటి జగ్జీవన్‌రావు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి దేవాదాయ ధర్మాదాయ శాఖ కొట్టు సత్యనారాయణను శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

వైసిపి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుల నియామకం

పెనుమంట్ర :వైసిపి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా మండలంలోని నెగ్గిపూడి పరిధి వనంపల్లిలో సత్తి వెంకటరెడ్డి, కొయ్యేటిపాడు దొంగ దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు సిఎం జగన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి, దుర్గాప్రసాద్‌లు ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు వారిద్దరిని అభినందించారు.

బలుసులమ్మకు వెండి వాకిలి : ఆలయ ఛైర్మన్ అంజిబాబు

తాడేపల్లిగూడెం :తాడేపల్లిగూడెం గ్రామదేవత బలుసులమ్మ అమ్మవారికి వెండి వాకిలి తయారు చేయిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ కొట్టు అంజిబాబు తెలిపారు. ఆ మేరకు ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మొత్తం 40 కేజీల వెండితో అమ్మవారికి వెండి వాకిలి తయారు చేయించే కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో భాగంగా తొలి విడతగా 25 కేజీల వెండితో వెండి వాకిలి తయారు చేయిస్తున్నామన్నారు. విజయదశమినాటికి ఇది సిద్ధమవుతుందన్నారు. దసరా ఉత్సవాల్లో అమ్మవారికి వెండి వాకిలి సమర్పిస్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రోత్సాహంతో పాటు భక్తుల సహకారంతో అమ్మవారి ఆలయ అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించి పనులు చేపట్టడంతో పాటు అమ్మవారికి వెండి కవచం, వెండి వాకిలి, వెండి ఉయ్యాల, నవ హారతులు వంటివి తయారు చేయించ సంకల్పించామన్నారు. వీటిలో వెండి కవచం పూర్తయిందని, వెండి వాకిలి కూడా పూర్తయ్యే దశలో ఉందని తెలిపారు.